క్లుప్తంగా

కరపత్రాల విడుదల

అచ్చంపేట రూరల్: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించే దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. కార్యక్రమంలో వాసవి కన్యకాపరమేశ్వరి చారిటబుల్‌ట్రస్టు అధ్యక్షుడు కొరివి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పాపిశెట్టి బాల్‌రాజు, కర్నెస్వామి, నరేష్, వినోద్ పాల్గొన్నారు.

ముగిసిన ఏఈఓల శిక్షణ



నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): నీరు, భూమి యాజమాన్యంపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ శనివారంతో ముగిసింది. భారత జలశక్తి మంత్రిత్వశాఖ సౌజన్యంతో జిల్లాకు చెందిన ఏఈఓలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని పాలెం రైతువేదిక వద్ద నిర్వహించారు. రైతులు తమ పంట పొలాల్లో నీటిని సంరక్షించుకునే విధానం, తక్కువ నీటితో సాగు చేసే పంటలు, ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో నేటసన్ ఇరిగేషన్ కంపెనీ డీజీఎం సుబ్బారావు, ఏడీఏ సునీత, ఏఓ నీతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

అచ్చంపేట రూరల్: సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనం కాంగ్రెస్ ప్రజాపాలన అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మోపతయ్య అన్నారు. ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను శనివారం హైదరాబాద్‌లో ఆయన ఘనంగా సన్మానించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రజల కోసం పని చేస్తున్న ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డిని, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణను విమర్శిస్తే తగిన బుద్ధి చెప్తామని అన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లికి చెందిన అనంతయ్యగౌడ్ అనారోగ్యంతో నిమ్స్ హాస్పటల్‌లో చేరడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.50లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి సహాయ సహకారాలతో బాధితుడికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు జైపాల్‌రెడ్డి అందజేసినట్లు తెలిపారు.

ఆలయానికి చౌక్ పీటల వితరణ

ఉప్పునుంతల: మండల కేంద్రానికి చెందిన స్వర్గీయ కర్నాటి లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం వారి కుమారులు శనివారం స్థానిక కేదారేశ్వర ఆలయానికి రూ.25 వేల విలువ చేసే తొమ్మిది చౌక్ పీటలను వితరణ చేశారు. ఆలయంలో నిర్వహించే వివిధ కార్యక్రమాలకు చౌక్ పీటలను వినియోగించుకోవడం జరుగుందని ఆలయ పూజారి శ్రీనివాసశర్మ తెలిపారు. కార్యక్రమంలో కర్నాటి శ్రీనివాసులు, తిర్పతయ్య, విక్రమ్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ

వెల్దండ: మొక్కలు పెంచడంతో కాలుష్య నివారణ సాధ్యమని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొట్ర గ్రామంలో మొక్కలను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న మొక్కలను ప్రజలందరికి అందించి వాటిని పెంచే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్‌జీ, టీఏలు సత్యనారాయణ, లింగమయ్య, తదితరులు ఉన్నారు.

ఘనంగా హిందీ దివాస్ వేడుకలు



వెల్దండ: మండలంలోని కొట్ర ఉన్నత పాఠశాలల్లో శనివారం హిందీ దివాస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ ప్రయోగాలు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రవీందర్, హెచ్‌హెచ్ఎం ప్రేమకుమారి, మన్సూర్, జహంగీర్, చెన్నకేశవులు, నర్సింహ, మక్బుల్ బారి, రమేష్, లక్ష్మణ్, రాజేందర్‌రెడ్డి, వనజ, తావుర్య, రామారావు, విజయ్, సరిత, ప్రభావతి, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా: ఇద్దరికి గాయాలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల గ్రామ సమీపంలో ప్రధాన రహదారి మలుపు దగ్గర ట్రాక్టర్ వేగంగా వెళ్తూ రోడ్డుపక్కనే ఉన్న వరి పైరులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తడుకల శివ ట్రాక్టర్ నడుపుతుండగా కాలు విరిగాయి. బోగ్యం చింటుకు చింటుకు వెన్నెముక విరిగింది. చుట్టు పక్కల వారు వారిని వెంటనే కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి అదుపులోనే ఉందని వైద్యులు తెలిపారు.

అంగన్‌వాడీలే స్కూల్ టీచర్లుగా..

- పోషణ్ అభియాన్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ



పోషణ్ అభియాన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట: రాబోయే రోజుల్లో అంగన్‌వాడీ టీచర్లు స్కూల్ టీచర్లుగా మారుతారని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం అచ్చంపేట అంబేడ్కర్ ప్రజా భవన్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందించాలనే ఆలోచన సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారన్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు యూనిఫాం ఇవ్వబోతున్నారని చెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, పోషణ్ అభియాన్ కార్యక్రమం గురించి మహిళలు, బాలింతలు, గర్భిణుల్లో చైతన్యం తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారిని రాజేశ్వరి, ఆర్డీఓ మాధవి, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి,పోషన్ అభియాన్ కార్యకర్తలు విజ్ఞాన్,ప్రదీప్,సూపరవైజర్ కమల పాల్గొన్నారు.

లింగాల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న పోషణ్ అభియాన్‌లో భాగంగా జీల్గు పల్లి తండాలో పోషణమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పౌష్టికాహారం వాడకంపై బాలింతకు, గర్భిణులకు అవగాహన కల్పించారు.

స్వీయ రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీదేవి

కల్వకుర్తి టౌన్: విద్యార్థినులు వారి స్వీయరక్షణకు ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాలని కల్వకుర్తి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి అన్నారు. శనివారం పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహనతో పాటు, న్యాయ విజ్ఞానంపై పలు అంశాలను గురించి వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, న్యాయవాదులు రాము, గోపాల్, నాగరాజు, మల్లేష్, శ్రీను, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పార్వతమ్మ, వైస్ ప్రిన్సిపాల్ రాజశ్రీ, సుజాత, కోర్టు సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు



కొల్లాపూర్: మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందిస్తామని చైర్‌పర్సన్ మేకల రమ్య అన్నారు. శనివారం పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించి, మిషన్ భగీరథ నీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులు ధృఢ సంకల్పంతో ముందుకు సాగాలి

తెలకపల్లి: విద్యార్థులు పట్టుదలతో, ధృఢ సంకల్పంతో ముందుకు సాగాలని ఎస్ఐ నరేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీఎల్ఆర్ విద్యా సంస్థలో డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పాజిటివ్ ఆలోచనలు చేయాలన్నారు. చెడు అలవాట్లు, సావాసాలకు దూరంగా ఉండాలని, సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజమహేందర్‌రెడ్డి, డైరెక్టర్లు మురళీధర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

ధర్నా వాల్‌పోస్టర్ విడుదల



నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెల 23న హైదరాబాద్ లోని సంక్షేమ బోర్డు వద్ద నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న శనివారం అంబేడ్కర్ చౌరస్తాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు 2017లో పెంచిన మెస్ ఛార్జీల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని మెనూ ప్రకారం నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, బక్కకృష్ణ, శివరాం, మహేందర్ పాల్గొన్నారు.

కొల్లాపూర్: హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి బత్తిని రాజు డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలోని సమస్యల పరిష్కారం కోసం 23న నిర్వహించతలపెట్టిన చలో సంక్షేమ భవన్ కార్యక్రమ పోస్టర్లను కొల్లాపూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో విడుదల చేశారు.

రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్‌పై అవగాహన

వెల్దండ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు రోబోటిక్స్ ఇన్ అకాడమిక్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోహం అకాడమీ ఫౌండర్ సహదేవ్ మాట్లాడుతూ జిల్లా విద్యాధికారి, జిల్లా విజ్ఞాన అధికారి సహకారంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యారంగంలో సృజనాత్మక సాంకేతిక నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించే నేపథ్యంలో సోహం అకాడమీ కృషి చేస్తుందన్నారు. సోహం అకాడమీ ఆధ్వర్యంలో రోబోటిక్స్ ఇన్ అకామిక్స్ ద్వారా విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో జిల్లా విజ్ఞానాధికారి రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపల్ స్వర్ణరత్నం, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్, సోహం అకాడమీ ఫౌండర్ సహదేవ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొండా లక్ష్మణ్‌కు ఘననివాళి



కల్వకుర్తిలో నివాళులర్పిస్తున్న సత్యం, తదితరులు

కల్వకుర్తిరూరల్: తెలంగాణ ఉద్యమ నాయకుడు దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను కొనియాడారు. బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేందర్, ముఖ్య సలహాదారుడు ఆనంద్‌కుమార్, విజ యగౌడ్, మధు, సైదులు గౌడ్, గంగాధరాచారి, రాంభూపాల్‌రెడ్డి, బాలరాజు, రమేష్ బాబు, సురేందర్‌గౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.

దోమలపెంట: తెలంగాణ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా దోమలపెంటలో భక్తమార్కండేయ ఆలయంలో పద్మశాలీలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నామని సునీందర్, రవికుమార్, రాము, శివదీప్, తిరుపతయ్య, సత్యం, ఉపేందర్, కోటయ్య, మల్లికార్జున్, యాదేశ్ ఉన్నారు.

గంజాయి, డ్రగ్స్‌ను తరిమికొడదాం



అచ్చంపేటలో మాట్లాడుతున్న సీఐ రవీందర్

అచ్చంపేట రూరల్: సమాజానికి, దేశానికి వెన్నెముకగా నిలిచే యువత భవిష్యత్‌ను చిత్తు చేసే గంజాయి, డ్రగ్స్ మహమ్మారి తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరు సన్నద్ధం కావాలని సీఐ రవీందర్ పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రగతి బీఈడీ కాలేజీలో డ్రగ్స్, గంజాయిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వర్దన్ సైదులు అధ్యక్షతన జరిగిన సదస్సులో సీఐ మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల యువత చెడు మార్గం వైపు వెళ్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ ఇంద్ర, ట్రస్మా ప్రైవేటు పాఠశాలల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలరాజు, సామాజిక కార్యకర్త శంకర్ బాబు, ప్రిన్సిపల్ జగతిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సయ్యద్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు సుల్తాన్, రవి, శివ, రాజు, శంకర్, మహేష్ పాల్గొన్నారు.

తపాలాశాఖలో ప్రమాదబీమా తీసుకోవాలి



ప్రమాదబీమాపై అవగాహన కల్పిస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా తపాలా బ్యాంకు మేనేజర్ ప్రసాద్

కోడేరు: తపాలాకార్యాలయంలో అమలు చేస్తున్న ప్రమాద బీమాను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా తపాలా బ్యాంకు మేనేజర్ ప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని పస్పులలో ప్రమాద బీమాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖలో కేవలం రూ.520లు చెల్లిస్తే రూ.10లక్షల బీమా వర్తిస్తుందని, రూ.799లు చెల్లిస్తే రూ.15లక్షల బీమా పొందవచ్చన్నారు. జిల్లాలో బీమా పథకంలో పది మంది బాధిత కుటుంబాలకు పరిహారం అందిచామని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జగన్, వనజ, గోపాల్‌రావు, శశిధర్‌రావు, మాజీ సర్పంచ్ సొప్పరి మల్లయ్య, డాక్టర్ గోపాల్‌రావు, సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణయ్య, ఉపసర్పంచ్ బాలసత్తయ్య, మల్లేష్, సమంత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై జాగ్రత్తలు తీసుకోవాలి



పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం నందకిషోర్ యాదవ్

పెద్దకొత్తపల్లి: వెన్నచర్ల, చంద్రకల్ ప్రాథమిక పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహించారు. వెన్నచర్లలో ప్రధానోపాధ్యాయులు నందకిషోర్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి ప్రవర్తన పట్ల నిఘావేయాలన్నారు. పాఠశాల చైర్మన్ బాలకిష్టమ్మ, తిరుపతయ్యగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చారకొండ: విద్యార్థుల తల్లిదండ్రులు బాధ్యతగా పిల్లలను పాఠశాలకు పంపించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని జీహెచ్ఎం భగవాన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ సత్యమ్మ, ఉపాధ్యాయులు, యాదగిరి, కమాలాకర్, అంజయ్య, రాజేందర్, మల్లికార్జున్, జైపాల్, గీత, రామభిక్షమ్మ, రామకృష్ణ, జంగయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

లింగాల: పిల్లల చదువులపై శ్రద్ధ కనబరుస్తూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని జీహెచ్ఎం బషీర్ అహ్మద్ తల్లిదండ్రులను కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, హెచ్‌డబ్ల్యూఓలతో సమావేశం నిర్వహించారు.

వందశాతం వ్యాక్సినేషన్ పూర్తి చేయాలి



వ్యాక్సిన్‌ను పరిశీలిస్తున్న రవికుమార్ నాయక్

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని ప్రతి చిన్నారికి వ్యాక్సిన్ వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సూచించారు. శనివారం మండలంలోని పాలెం పీహెచ్‌సీ పరిధిలోని కారుకొండ, లింగసానిపల్లి అవుట్ రిచ్ ఏరియాల్లో నిర్వహిస్తున్న వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జ్వర పీడుతుల వివరాలను అందజేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది కుమార్, రాజేష్, ఏఎన్ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు



సైకాలజిస్ట్ శ్రీనివాసులును సన్మానిస్తున్న విద్యార్థులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు ఏకాగ్రతతో చదివినప్పుడే మంచి ఉత్తీర్ణత సాధిస్తారని ప్రముఖ సైకాలజిస్ట్ అండ్ మోటివేషనల్ స్పీకర్ డి శ్రీనివాస్ అన్నారు. శనివారం విద్యార్థులకు చదువు ప్రాముఖ్యతపై వివరించారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి, సరిగ్గా గుర్తుంచుకోవాలని, ఎలాంటి పద్ధతులు పాటించాలి, పరీక్షలంటే భయం లేకుండా సన్నద్ధం కావాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే వివిధ సమస్యల వల్ల ఒత్తిడి తట్టుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సుప్రజాత, అధ్యాపకులు వెంకటేశ్వరావు, శ్రీనివాసులు, రామారావు, రవీందర్‌రెడ్డి, స్వర్ణలత, యాదయ్య పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న డబుల్‌బెడ్రూంల పోరాట సంఘం నాయకులు

కల్వకుర్తిరూరల్: దసరా లోపు అర్హులైన లబ్ధిదారులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలని డబుల్ బెడ్రూం లబ్ధిదారుల పోరాట సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. లక్కీడ్రాలో గెలుపొంది, సొంత ఇళ్లు లేక అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నామన్నారు. అద్దెలు కట్టేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో పెండింగ్‌లో ఉన్న కరెంట్, వాటర్ పనులను పూర్తి చేసి దసరా వరకు లబ్ధిదారులకు అందించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ దసరా వరకు ఇళ్లను అప్పజెప్పేలా చూస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, కార్యదర్శి కృష్ణవేణి, నర్సింహ, పద్మ, వెంకటాచారి, సాయిబాబ, శ్రీనివాసులు, సఫియా, కృష్ణవేణితో పాటు పలువురు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



సాతాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దకొత్తపల్లి: సాతాపూర్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం తెలిపారు. బాల్య వివాహాలు లేని భారతదేశం కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు, కైలాస్ సత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ అసిస్టెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరి, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, పాపల్‌రాయుడు, కృష్ణయ్య, సుజాత, లక్ష్మి, జయప్రసాద్, వాణి, శ్రీదేవీ, రామచంద్రయ్య, వహీద్‌లు పాల్గొన్నారు.

తెలకపల్లి: బాల్య వివాహాలు నిరోధించడం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు భావించాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కైలాశ్ సత్యర్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో 'బాల్య వివాహాలను నిరోధించడం నా బాధ్యత' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత, పద్మలతారెడ్డి, శ్రీలత, అశోక్, శ్రీనయ్య, జయమ్మ, రవీందర్, విజయభాస్కర్, ఆనంద్, గోవర్ధన్‌రావు, కోనేరు సంస్థ అసిస్టెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లిలో భారీ వర్షం



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో, మండలంలోని మల్లేశ్వరం, మంచాలకట్ట, జటప్రోల్ వంటి గ్రామాల్లో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు భారీగా వర్షం కురిసింది. 20 రోజులుగా వర్షాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్న తరుణంలో వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పెంట్లవెల్లిలోని పలు ప్రధాన రోడ్లు, కాలనీలు జలమయం అయ్యాయి.

పిడుగుపాటుతో ఆవు మృతి

చారకొండ: పిడుగుపడి పాడిఆవు మృత్యువాత పడిన ఘటన దొడ్లపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. యాపర్ల మాధవరెడ్డి రోజువారీ మాదిరిగా శనివారం తమ వ్యవసాయ పొలంలో నాలుగు ఆవులను మేపుతున్నాడు. ఈక్రమంలో ఒక ఆవు కొంత దూరంగా చెట్టుకిందకు వెళ్లింది. ఆ సమయంలో వర్షం కురిసి పిడుగుపడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తాను చూస్తుండగానే ఆవు మృతిచెందిందని మాధవ రెడ్డి వాపోయారు. ఆవు విలువ రూ. లక్ష ఉంటుందన్నారు.

పారిశుద్ధ్యంపై పట్టు బిగించాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై పట్టు బిగించాలని ఎంపీడీఓ బ్రహ్మచారి అన్నారు. శనివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇంద్రకల్, బలాన్‌పల్లి, ఐతోల్ గ్రామాలను సందర్శించారు.

చారకొండ: సీజనల్ వ్యాధుల ప్రబలకుండా గ్రామంలో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండలంలోని సీర్సనగండ్లలో ఆయన అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. నర్సరీని పరిశీలించి వాటి నిర్వాహణకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. మండలంలోని సీర్సనగండ్లలో 10 వార్డుల ఓటరు జాబితాను, వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు.

ట్యాంక్‌లను శుభ్రం చేయాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని మిషన్‌భగీరథ ఏఈ శివకుమార్, సహాయకుడు శంకర్‌లు కోరారు. శనివారం మండలంలోని యాదిరెడ్డిపల్లి, గుంతకోడూరు, బలాన్‌పల్లిని సందర్శించారు. నెలకు ఒకసారైన ట్యాంక్‌ను శుభ్రం చేయడంలో కార్మికులు శ్రద్ధ తీసుకోవాలని, బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయాలన్నారు.

ముగ్గురికి రిమాండ్

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): తిమ్మాజీపేట మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేసి తలను పగలగొట్టిన కేసులో ముగ్గురికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని కోర్టు ముందు హాజరు పరిచి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నాగర్‌కర్నూల్ క్రైం: పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. పట్టణ రెండో ఎస్ఐ రమాదేవి సమాచారం మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన బాబు, చంద్రశేఖర్, అరవింద్, షేక్‌బషీరుద్దీన్, రాజశేఖర్, మహేష్‌లు కేసరి సముద్రం చెరువుకు వెళ్లే రహదారిలో ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని పేకాట రాయుళ్లను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ.6080 నగదుతో పాటు 6సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూలైఫ్ ఆస్పత్రి నిర్వాహకులకు షోకాజ్ నోటీస్

నాగర్‌కర్నూల్ క్రైం: వివాహితపై అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటనలో న్యూ లైఫ్ ఆస్పత్రి నిర్వాహకులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి స్వరాజ్యలక్ష్మి షోకాజు నోటీస్ జారీ చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న తాడూరు మండలం ఎత్మతాపూర్‌కు చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. న్యూ లైఫ్ ఆస్పత్రిలో ఎండీ సమీర్ అర్హత లేకున్నా రోగులకు వైద్యం చేస్తున్నాడని, బిజినపల్లి మండలం గుడ్ల నర్వ గ్రామానికి చెందిన వట్టేపు అరవింద్‌కు ట్రీట్ మెంట్ చేయడంతో కిడ్నీ పాడైన సంఘటనపై ఈనెల 18న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ ఫిర్యాదు చేశాడు. దీని ఆధారంగా న్యూ లైఫ్ ఆస్పత్రి లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని షోకాజు నోటీసులో పేర్కొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక వాహనదారులు అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వైజయంతి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోకుండా అక్రమంగా ఇసుకను తరలించవద్దని, అధికారులను కాదని ఇసుకను తరలిస్తే ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు.

బస్సు సర్వీసులపై వినతి

కల్వకుర్తి టౌన్: డిపో పరిధిలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో బస్సు సర్వీసులు నడపాలని సలహాలు, సూచనలు ఎక్కువగా వచ్చినట్లుగా డిపో మేనేజర్ సుభాషిణి తెలిపారు. ఫోన్‌లో సలహాలు చేసిన వాటిలో కల్వకుర్తి–కొల్లాపూర్‌కు సాయంత్రం వేళల్లో బస్సు సర్వీసు, నాగర్‌కర్నూల్–కల్వకుర్తికి ఉదయం 8గంటల సమయంలో ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడపాలని ప్రయాణికులు సూచించారు. కల్వకుర్తి–శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఒక సర్వీసు, కల్వకుర్తి–మద్దిమడుగుకు మరో సర్వీసు నడపాలని ప్రయాణికులు విన్నవించారు. రూట్లను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటాయని డీఎం తెలిపారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది పాల్గొన్నారు.